సాక్షి
నల్లగొండ
శనివారం, 8, మార్చి, 2025





సమాజంలో సగభాగమైన మహిళలు మాత్రం ఇంటా బయట ఇంకా వివక్షను ఎదుర్కొంటున్నారు. ఆధునిక సమాజంలో కూడా పురాతన పోకడలు కనిపిస్తున్నాయి. అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని 'సాక్షి' ఉమ్మడి జిల్లాలోని ఏడు ముఖ్య పట్టణాల్లో మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై నిర్వహించిన సర్వేలో పలు విషయాలు వెలుగుచూశాయి. 7 పట్టణాల్లో 18 నుంచి 50 సంవత్సరాల వయస్సున్న 200 మంది మహిళలపై నిర్వహించగా.. ఇప్పటికీ ఇంట్లో ఆడ మగ వివక్షను ఎదుర్కొంటున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – సాక్షి, నెట్‌వర్క్


అక్కడ.. ఇక్కడ కాదు.. ఎక్కడైనా వివక్షే!

- ఆడ మగ వివక్ష ఇంట్లో కూడా ఉంది
- బయట ప్రదేశాలకన్నా ఆఫీస్, కళాశాలల్లోనే ఎక్కువ ఇబ్బంది


ప్రశ్న: మీ ఇంట్లో ఆడ-మగ వివక్ష ఏమైనా ఉందా..?




ప్రశ్న: మీ కాలేజీ, పని ప్రదేశంలో మహిళగా ఏమైనా వివక్షను ఎదుర్కొంటున్నారా..?



ప్రశ్న: మీరు ఎక్కువ ఇబ్బంది పడుతున్న ప్రదేశం..?



ప్రశ్న: మిమ్మల్ని ఇబ్బంది పెడుతున్న వారిలో అత్యధికులు ఎవరు..?



షీటీమ్స్‌తో .. ఆమెకు భరోసా



మాట్లాడుతున్న షీటీమ్ సీఐ కరుణాకర్

నల్లగొండ : మహిళా రక్షణకు షీటీమ్స్ అండగా నిలబడుతున్నాయి. మహిళలకు తెలియకుండానే వారికి భద్రత కల్పిస్తున్నాయి. బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, స్కూళ్లు, కాలేజీలు తదితర ప్రాంతాల్లో షీటీమ్ పోలీసులు మఫ్టీలో విధులు నిర్వహిస్తూ బాలికలు, మహిళలను వేధించేవారి ఆటకట్టిస్తున్నాయని చెబుతున్నారు నల్లగొండ షీటీమ్ సీఐ కోట కరుణాకర్. మహిళా దినోత్సవం సందర్భంగా ఆయన 'సాక్షి'తో మాట్లాడారు.



మహిళా భద్రత కోసం ప్రభుత్వం జిల్లాలో షీటీమ్‌లను ఏర్పాటు చేసింది. అమ్మాయిలను ఎవరైనా వెంబడించినా, బెదిరించినా, వేధించినా షీటీమ్ పోలీసులకు లేదా 100 నంబర్‌కు కాల్ చేయాలి. వెంటనే పోలీసులు వచ్చి వారిని పట్టుకుంటారు. పోలీసులకు సమాచారం ఇచ్చే వారి పేర్లు గోప్యంగా ఉంచుతాం. అంతేకాదు టీ సేఫ్ యాప్‌ను కూడా ఏర్పాటు చేశాం. ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని.. ఆటో ఎక్కిన వెంటనే సదరు మహిళ ఆటోనెంబర్‌ను ఆ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఒకవేళ ఏదైనా ఎమర్జెన్సీ ఉంటే యాప్‌లో ఎమర్జెన్సీ బటన్ నొక్కితే ఆ ఏరియా పోలీస్‌స్టేషన్‌కు సమాచారం వెళ్లి వెంటనే ఆ పోలీసులు అక్కడికి చేరుకుంటారు. ప్రస్తుతం నల్లగొండ, మిర్యాలగూడలోనే మహిళా పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. వాటిని కూడా పెంచే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఇప్పటికే అమ్మాయిలను వేధించే 103 మందిని షీటీమ్‌లు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని కేసులు నమోదు చేశాయి. 149 మందిపై వేధింపుల కేసులు నమోదయ్యాయి. 7 కేసులు ఎఫ్ఐఆర్ అయ్యాయి. 88 మందిపై పిట్టీ కేసులు నమోదయ్యాయి. షీటీమ్స్ ఆధ్వర్యంలో విద్యార్థినులు, మహిళలకు 485 చోట్ల అవగాహన కార్యక్రమాలను నిర్వహించాం.

నేడు జాతీయ లోక్ అదాలత్

రామగిరి(నల్లగొండ): జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు శనివారం జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టు ప్రాంగణాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.నాగరాజు తెలిపారు. లోక్ అదాలత్‌లో సివిల్ కేసులు, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, మోటార్ వాహన ప్రమాద కేసులు, బ్యాంకు రికవరీ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, భూ వివాదాలు, సైబర్ క్రైమ్ కేసులు, ఇతర సివిల్ దావాలు పరిష్కరించుకోవచ్చని అన్నారు. కేసుల పరిష్కారానికి పోలీస్ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, న్యాయవాదులు, ఇన్సూరెన్సు అధికారులు, రెవెన్యూ అధికారులు, బ్యాంకు అధికారులు సహకరిస్తారని తెలిపారు.

అసమానతలు అంతరించాలి

మహిళా చైతన్యంలో పత్రికల పాత్ర కీలకం

వివక్షను రూపుమాపితేనే అద్భుత సమాజం | బాధిత మహిళలకు అండగా ఉండాలి | న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.దీప్తి

మహిళా దినోత్సవం సందర్భంగా 'సాక్షి' గెస్ట్ ఎడిటర్‌గా విధులు



సాక్షి ఎడిటోరియల్ విభాగంలో గెస్ట్ ఎడిటర్ విధుల్లో సీనియర్ సివిల్ జడ్జి బి.దీప్తి

రామగిరి(నల్లగొండ) : సమాజంలో కొన్నిచోట్ల ఇంకా లింగ వివక్ష కనిపిస్తోందని అది అంతరించాలని నల్లగొండ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బి.దీప్తి పేర్కొన్నారు. మహిళా చైతన్యంలో పత్రికల పాత్ర కీలకమన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం 'సాక్షి' యూనిట్ కార్యాలయంలో ఆమె గెస్ట్ ఎడిటర్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా మహిళా దినోత్సవ ప్రత్యేక కథనాలపై చర్చించి పలు సూచనలు చేశారు.

సమాన అవకాశాలు ఉండాలి

మహిళలు సమస్యలకు కుంగిపోకుండా ధైర్యంగా నిలబడాలని జడ్జి దీప్తి సూచించారు. మహిళా సాధికారత జరిగినప్పుడే సమాజంలోని అసమానతలు తొలగిపోతాయన్నారు. మహిళలను తక్కువ చేసి చూడకుండా సమాన అవకాశాలు కల్పించేందుకు కృషి చేయాలన్నారు. మహిళలకు అన్ని రంగాల్లో భాగస్వామ్యం కల్పిస్తే వారి సమస్యలను వారే పరిష్కరించుకోగలుగుతారని పేర్కొన్నారు. బాధ్యతల విషయంలో మహిళలను వేరు చేసి చూడొద్దన్నారు. ఉద్యోగం చేసే మహిళలను కొందరు కుటుంబాన్ని, ఉద్యోగాన్ని ఎలా బ్యాలెన్స్ చేస్తున్నావని అడుగుతారని.. అదే ప్రశ్న మగవారిని మాత్రం అడగరని ఇది సరి కాదన్నారు. సమాజంలో వివక్షను రూపుమాపితేనే మహిళలు స్వేచ్ఛాయుత ప్రయాణానికి అడుగులు పడతాయన్నారు. సమాజంలో అంతరాలు రూపుమాపితేనే అద్భుత సమాజం ఆవిష్కృతమవుతుందన్నారు.



కథనాలు పరిశీలిస్తూ.. సూచనలు చేస్తూ..

మహిళా దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక పేజీలు, కథనాలను జడ్జి బి.దీప్తి పరిశీలించారు. మహిళలపై ప్రత్యేకంగా రూపొందించిన కథనాలను చూసి ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. మద్యపాన నిషేధం కోసం మహిళలు పోరాడిన కథనాలను ప్రశంసించారు. పత్రికలు మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహించేలా.. చైతన్యం కలిగించే కథనాలు అందించాలన్నారు. బాధిత మహిళలకు అండగా ఉండాలని సూచించారు.

న్యాయ సహాయం అందిస్తాం..

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా బాధితులకు న్యాయ సహాయం అందిస్తున్నామని జడ్జి దీప్తి తెలిపారు. అందరికీ సమాన న్యాయం దక్కాలనేది తమ సంస్థ లక్ష్యమన్నారు. న్యాయపరంగా వెనుకబడిన వారికి అండగా న్యాయ సేవాధికార సంస్థ చేయూతనిస్తోందని.. ఇప్పటికే అనేక న్యాయ చైతన్య సదస్సులు నిర్వహించి ప్రజలను చైతన్యపర్చామన్నారు. ఇరువర్గాల మధ్య సమన్వయకర్తగా వ్యవహరించి సత్వర న్యాయం అందేలా సహకరిస్తామన్నారు. న్యాయ సహాయం పొందాలనుకునే వారు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థను సంప్రదించాని సూచించారు.

జగన్మోహినిగా వెలిగి.. ఎదుర్కోలుకు కదిలి



స్వామి, అమ్మవారిని ఊరేగింపుగా ఎదుర్కోలు మండపానికి తోడ్కొని వెళ్తున్న అర్చకులు, అధికారులు.. చిత్రంలో పట్టువస్త్రాలతో కలెక్టర్ దంపతులు, ఈఓ

యాదగిరిగుట్ట: యాదగిరీశుడి బ్రహ్మోత్సవాలు ఆగమశాస్త్రం ప్రకారం వైభవంగా కొనసాగుతున్నాయి. కల్యాణోత్సవానికి ముందస్తుగా పెళ్లిచూపుల పర్వం జరుపుకున్న శ్రీస్వామివారు శుక్రవారం ఉదయం జగన్మోహిని రూపం దాల్చారు. రాత్రి అశ్వవాహనంపై ఎదురుర్కోలు జరుపుకున్నారు.

ఎదుర్కోలు మహోత్సవం సాగిందిలా..

బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమైన ఎదుర్కోలు మహోత్సవం శుక్రవారం రాత్రి వేదపండితుల మంత్రోచ్ఛరణలతో వీనులవిందుగా సాగింది. పట్టువస్త్రాలు, బంగారు ఆభరణలతో అలంకరించిన శ్రీస్వామివారిని అశ్వవాహనంపై, అమ్మవారిని ముత్యాల పల్లకిపై అధిష్టింపజేసి ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. అనంతరం తూర్పురాజగోపురం ఎదుట మాడ వీధిలో స్వామి వారిని పశ్చిమ ముఖంగా, అమ్మవారిని తూర్పుముఖంగా అధిష్టింపజేశారు. ఆలయ ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి, ప్రధానార్చకులు నల్లంథీఘల్ లక్ష్మీనరసింహచార్యులు, కాండూరి వెంకటచార్యులు, అర్చకులు, ఇతర అధికారులు శ్రీస్వామి, అమ్మవారి తరపున విడిపోయి పెద్దలుగా వ్యవహరించారు. ఇరువురి గుణగణాలు, ఆదాయం, వ్యయం, కట్నకానులకపై వివరించారు. అనంతరం తిరుకల్యాణ మహోత్సవానికి ముహూర్తం నిర్ణయించారు. అంతకుముందు ఉదయం శ్రీలక్ష్మీనరసింహుడు జగన్మోహిని అలంకారంలో ఆలయ మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.



బ్రహ్మోత్సవాల్లో నేడు..

లక్ష్మీసమేత నారసింహుడు శనివారం ఉదయం రామాలంకారంలో హనుమంత సేవపై దర్శనమిస్తారు. రాత్రి 8.30 గంటలకు నుంచి గజవాహన సేవపై ఊరేగింపుగా కల్యాణమండపానికి బయలుదేరి వెళ్లారు. అనంతరం స్వామి, అమ్మవారి తరుకల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు.

జనరిక్ మందులను వినియోగించాలి

- డీఎంహెచ్ఓ పుట్ల శ్రీనివాస్



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీనివాస్

చిట్యాల: ప్రజలు జనరిక్ మందులు వినియోగించి ఆర్థిక భారాన్ని తగ్గించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ సూచించారు. చిట్యాల మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన జన ఔషధి దివస్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మార్కెట్‌లో లభించే ఇతర మందులతో పోల్చితే జనరిక్ మందుల ధరలు యాభై నుంచి ఎనభై శాతం వరకు తక్కువ ధరలో లభ్యమవుతాయని, రోగ నివారణలో సైతం మెరుగైన స్థాయిలో పనిచేస్తాయని తెలిపారు. జనరిక్ మందులపై అపోహలు తొలగించుకోవాలని డీఎంహెచ్ఓ సూచించారు. అనంతరం డీటీసీఓ డాక్టర్ కల్యాణ చక్రవర్తి జనరిక్ మందుల వినియోగంపై ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓలు డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ రవి, చిట్యాల పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ వెంకటేశ్వర్లు, సత్య నరేష్, సీహెచ్ఓ నర్సింగరావు, సూపర్‌వైజర్ వెంకటరమణమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆటంకం లేకుండా ఇసుక సరఫరా చేయండి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ : జిల్లాలో అభివృద్ధి పనులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఇసుక సరఫరా చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. శుక్రవారం అధికారులతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. ప్రతి మండలానికి ఇసుక రీచ్‌లను గుర్తించి సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. అనుమతి లేకుండా ఇసుక తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సంబంధిత మండల అధికారి జారీ చేసిన అనుమతి పత్రంతో మాత్రమే ఇసుక రవాణా చేయాలన్నారు.

నేడు మంత్రుల రాక

నల్లగొండ : జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలు శనివారం నల్లగొండకు రానున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు మంత్రులు కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌కు చేరుకుంటారు. అక్కడ ఉమ్మడి జిల్లా ఇరిగేషన్, మిషన్ భగీరథ, విద్యుత్ శాఖలపై సమీక్షించనున్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్, అదనపు కలెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొననున్నారు.

టూటౌన్ పోలీసులకు ఎస్పీ అభినందన

నల్లగొండ : జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో కిడ్నాప్ అయిన బాలుడి కేసును ఛేదించిన పోలీసులను ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అభినందించారు. కిడ్నాప్ అయిన బాలుడితోపాటు నల్లగొండ పట్టణంలోని టూటౌన్ పోలీసులు శుక్రవారం ఎస్పీని కలిశారు. బాలుడిని ఎస్పీ ఎత్తుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేసును 48 గంటల్లో ఛేదించినందుకు పోలీసులను ప్రశంసించారు.



బాలుడితో ఎస్పీ శరత్‌చంద్ర పవార్

ముగిసిన ఆపదమిత్ర వలంటీర్ల శిక్షణ



సర్టిఫికెట్ అందజేస్తున్న డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి

నల్లగొండ : జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం ఆధ్వర్యంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆపదమిత్ర వలంటీర్లకు నిర్వహిస్తున్న రెండో విడత శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. 12 రోజులపాటు నిర్వహించిన శిక్షణలో ఎన్డీఆర్ఎఫ్ అధికారులు, జిల్లా ఫైర్, అటవీ, వైద్య, రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్, మత్స్య శాఖ, వివిధ ఇంజనీరింగ్ శాఖల అధికారులు వలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ వై.శేఖర్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ అగ్నిప్రమాదాలు, వరదలు, భూకంపాలు విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రాణాపాయస్థితిలో ఉన్నవారిని రక్షించడం, ప్రథమ చికిత్స, వివిధ శాఖలతో సమన్వయం చేసుకోవడం వంటి అంశాలపై ఆపదమిత్ర వలంటీర్లకు అవగాహన కల్పించామని తెలిపారు. శిక్షణలో భాగంగా వలంటీర్లను రెండు గ్రూపులుగా విభజించి నాలుగు గ్రామాల్లో క్షేత్రస్థాయి సందర్శన చేయించామన్నారు. చెరువుల్లో చిక్కుకున్న వారిని రక్షించడంపై పానగల్ ఉదయ సముద్రంలో ఫైర్, మత్స్య శాఖ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చామని పేర్కొన్నారు. అనంతరం వలంటీర్లకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంసీఆర్ హెచ్ఆర్డీ ఐటీ ప్రాంతీయ శిక్షణ మేనేజర్ పి.వెంకటేశ్వర్లు, డీపీఎం మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మద్యంపై.. మహిళల సమరం

బెల్టు షాపులు బంద్ చేయించిన అతివలు

- గ్రామాల్లో మద్యం అమ్మకాలు జరిపితే జరిమానా విధించాలని నిర్ణయం
- ఆదర్శంగా నిలుస్తున్న చిట్యాల మండలం ఏపూరు, రాజాపేట మండలం పాముకుంట

ఎక్కడమ్మా నువ్వు లేనిది.. ఏమిటీ నువ్వు చెయ్యలేనిదీ. మహిళలు ఏకమైతే సాధించలేనిది ఏమీ లేదు. గ్రామాల్లో మద్యం మహమ్మారికి యువత బానిస కావడం, కొన్ని కుటుంబాలు చిన్నాభిన్నం అవడంతో ఆ ఊళ్లలో మహిళలు కొంగు నడుముకు చుట్టారు. మద్యం మహమ్మారిని పారదోలాలని నిర్ణయించుకున్నారు. గ్రామంలో నిర్వహించే బెల్టు దుకాణాలపై సమరం సాగించారు. మద్యం అమ్మకాలను అడ్డుకుని ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలిచారు చిట్యాల మండలం ఏపూరు, రాజాపేట మండలం పాముకుంట మహిళలు.

– చిట్యాల, రాజాపేట

చిట్యాల మండలం ఏపూరు గ్రామం జాతీయ రహదారికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ గ్రామంలో 1950 మందికిపైగా జనాభా ఉంది. ఈ గ్రామానికి చెందిన పురుషులు ఎక్కువగా డ్రైవర్లుగా, కార్మికులుగా జీవనం సాగిస్తున్నారు. ఆ గ్రామంలో పదిహేనుకుపైగా బెల్టుషాపులు ఉన్నాయి. వీటిలో అన్ని రకాల బ్రాండ్‌లకు చెందిన మద్యం లభిస్తుంది. దీంతో ఆ గ్రామంలోని యువకులతో పాటు చుట్టుపక్కల పరిశ్రమల్లో పనిచేసే వందలాది మంది కార్మికులు సైతం ఇక్కడ విచ్చలవిడిగా మద్యం సేవిస్తుంటారు. ఆ గ్రామానికి చెందిన పలువురు మద్యం మత్తులో రోడ్డు ప్రమాదాలకు గురై ప్రాణాలు పోగొట్టుకున్నారు. మరికొందరు చేసిన పనిచేసిన డబ్బులను మద్యానికి ఖర్చు చేస్తూ కుటుంబాలను పట్టించుకోవటం లేదు. దీంతో ఆ గ్రామ మహిళలంతా ఏకమై మద్యం మహమ్మారిని పారదోలాలని నడుం బిగించారు.



చిట్యాల: ఏపూరులో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సమావేశమైన మహిళలు (ఫైల్)

బెల్టు దుకాణాలు మూసివేయాలని హెచ్చరిక..

ఏపూరు గ్రామానికి చెందిన ఓ యువకుడు (20) ఫిబ్రవరి 12న రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఆ యువకుడి మృతికి మద్యం మహమ్మారే కారణమని భావించారు. ఆ యువకుడు మృతి చెందిన రోజే గ్రామంలో మద్యపాన నిషేధానికి నడుం బిగించారు. ఆ గ్రామంలోని మహిళ సంఘం అధ్యక్షురాలు వలిగొండ సునీత, ప్రధానకార్యదర్శి బొంగు శ్రీలత, వీబీకే బండ అనురాధ ఆధ్వర్యంలో మహిళలంతా ఏకమై బెల్టు దుకాణాలను మూసివేయాలని డిమాండ్ చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామ పంచాయతీ వద్ద సమావేశమై నిరసన తెలిపారు. గ్రామంలో బెల్టు దుకాణాల వద్దకు వెళ్లి మద్యం అమ్మొద్దని హెచ్చరించారు. గ్రామంలో బెల్టు దుకాణాలు నిర్వహిస్తే రూ.లక్ష, మద్యం తాగిన వారికి రూ.20 వేలు జరిమానా.. మద్యం అమ్మినవారి సమాచారం అందిస్తే రూ.10 వేల ప్రోత్సాహకం అందజేస్తామని తీర్మానించారు. ఆ రోజు నుంచి గ్రామంలో మద్యం అమ్మకాలు నిలిచిపోయాయి.

నెలరోజులుగా మద్యం అమ్మడం లేదు



మా గ్రామంలో పదిహేనుకు పైగా బెల్టు దుకాణాల్లో మద్యం అమ్మేవారు. గ్రామంలోని యువతతో పాటు పెద్దవారు సైతం మద్యానికి బానిసై ఆర్థికంగా.. ఆరోగ్య పరంగా నష్టపోతున్నారు. ఇటీవల మద్యం మత్తులో ఓ యువకుడు మృతిచెందాడు. వెంటనే గ్రామంలో బెల్టు దుకాణాలను అరికట్టాలని మహిళలమంతా కలిసి ర్యాలీ నిర్వహించాం. మద్యం అమ్మితే జరిమానా విధించాలని తీర్మానించాం. నెల రోజులుగా గ్రామంలోని బెల్టు దుకాణాలను తొలగించారు. మద్యం అమ్మకాలు నిలిచిపోయాయి.

– బొంగు శ్రీలత, మహిళా సంఘం ప్రధానకార్యదర్శి, ఏపూరు

వేలంపాటను అడ్డుకుని..

రాజాపేట : యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని పాముకుంట గ్రామంలో మూకుమ్మడిగా మద్యపాన నిషేధం పాటిస్తున్నారు. గ్రామంలో కొన్ని సంవత్సరాలుగా బెల్టుషాపులు నడుస్తుండటంతో వృద్ధులు, యువకులు, పేదలు మద్యానికి బానిసై.. సంపాదించిందల్లా మద్యానికి ఖర్చు చేస్తు నారు. అంతే కాకుండా గ్రామంలో బెల్టుషాపుల నిర్వహణ కోసం ఇటీవల వేలం పాట నిర్వహించారు. వేలంపాట వద్దని.. గ్రామంలోని కొంతమంది మహిళలు గ్రామస్తులతో కలిసి గ్రామంలో ఎలాంటి బెల్టుషాపులు నిర్వహించొద్దని, మద్యం విక్రయించొద్దని మూకుమ్మడిగా నిర్ణయం తీసుకుని అమలు చేస్తున్నారు.

అప్పట్లో సారాపై పోరాటం

పాముకుంట గ్రామంలో 2010–11 సమయంలో సారా ఏరులైపారేది. కూలినాలి చేసి వచ్చిన డబ్బంతా తాగుడుకే పోయేది. ఆ సమయంలో కుటుంబ పెద్దలను కోల్పోయి చాలా కుటుంబాలు వీధిన పడ్డాయి. దీంతో గ్రామానికి చెందిన మహిళలు ఏకమై సారా విక్రయ కేంద్రాలపై దాడిచేసి సామగ్రిని గ్రామం నడిబొడ్డున దహనం చేశారు. నాతర్వాత ప్రభుత్వం సారా విక్రయాన్ని నియంత్రించడంతో ఏడాదిపాటు గ్రామంలో సారా, మద్యం విక్రయాలు జరగలేదు.



మద్యం విక్రయించొద్దని పాముకుంట ఎస్సీ కాలనీలో నిరసన తెలుపుతున్న మహిళలు

మహిళలంతా ఏకమయ్యాం



గ్రామంలో విచ్చలవిడిగా బెల్టుషాపులు ఉండడంతో పేదలు మద్యానికి బానిసవుతున్నారు. రోజంతా కూలికి వెళ్లి సంపాదనంతా తాగుడుకే తగలేస్తున్నారు. కుటుంబాలను పట్టించుకోకపోవడంతో మహిళలు ఇబ్బంది పడుతున్నారు. నాభర్త మద్యం సేవించి పక్షవాతంతో మంచానికే పరిమితం అయ్యాడు. దీంతో గ్రామంలో మద్యం విక్రహించకుండా మహిళలంతా ఏకమయ్యాం.

– వట్టిపల్లి లక్ష్మీనర్సమ్మ, పాముకుంట

ఆర్థిక స్వావలంబనతోనే మహిళాభివృద్ధి



ఆర్థిక స్వావలంబనతోనే మహిళాభివృద్ధి సాధ్యమవుతుంది. మహిళలు చదువుకు ప్రాధాన్యమివ్వాలి. నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి. పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించేందుకు కృషిచేయాలి. ఆత్మనూన్యతాభావాన్ని వీడి ఆత్మవిశ్వాసంతో ముందుకు పోవాలి. పురుషుల కన్నా ఏ విషయంలోనూ తక్కువ కాదని నిరూపించుకోవాలి. స్వశక్తిని నమ్ముకున్న మహిళలకు సమాజంలో అద్భుత అవకాశాలున్నాయి. వాటిని సద్వినియోగం చేసుకోవాలి. మహిళా సాధికారతతోనే సమాజాభివృద్ధి జరుగుతుంది. – పద్మావతిరెడ్డి, కోదాడ ఎమ్మెల్యే

మహిళలు సమాజానికి వెన్నెముక

మహిళలు సమాజానికి వెన్నెముక లాంటి వారు. ఉద్యోగం, వ్యాపారం, నాయకత్వం .. ఇలా ఏదైనా సరే మహిళలు తమ ప్రతిభను చాటుతున్నారు. మహిళలు మానసికంగా, శారీరకంగా ధృడంగా ఉన్నప్పుడే వారు ఎలాంటి కుంగుబాట్లకు లోనుకారు. దేవరకొండ ప్రాంతాన్ని మహిళలకు సురక్షిత ప్రదేశంగా మార్చేందుకు అవిశ్రాంతంగా పని చేస్తున్నాం. మహిళలకు ఎలాంటి సహాయ సహకారాలు అందించేందుకు ముందుంటాం. మహిళా సాధికారతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు. – మౌనిక, ఏఎస్పీ, దేవరకొండ



మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం నల్లగొండలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ముగ్గు వేస్తున్న మహిళలు



చేనేతలో 'ఆమె' ఘనత

- సిల్క్ ఇండస్ట్రీ యూనిట్ స్థాపించి 50 మందికి ఉపాధి కల్పిస్తున్న పోచంపల్లి వాసి ఎన్నం మాధవి





ఢిల్లీలో చేనేత ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసిన ఎన్నం మాధవి (ఫైల్) (ఇన్‌సెట్‌లో) చీరను చూపుతున్న మాధవి

భూదాన్‌పోచంపల్లి: యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లికి చెందిన చేనేత కళాకారిణి ఎన్నం మాధవి చేనేత రంగంలో అనేక ప్రయోగాలు చేస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతోంది. ఇంటర్ వరకు చదువుకున్న ఆమె తన భర్త ఎన్నం శివకుమార్ సహకారంతో కొర (లైట్ గోధుమరంగు), లైట్ పింక్, టర్కిష్ బ్లూ, గ్రే, లైట్ బ్రౌన్ రంగులతో మర్తాస్ ఫుల్ డిజైన్‌తో కూడిన వస్త్రాన్ని ఆవిష్కరించింది. దీంతో గతేడాది జాతీయ చేనేత దినోత్సవం రోజున రాష్ట్ర ప్రభుత్వం ఆమెను ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డుతో సత్కరించింది. ఇటీవల ఢిల్లీలో రిపబ్లిక్ డే వేడుకల సందర్భంగా నిర్వహించిన పరేడ్‌లో ఆమె తెలంగాణ నుంచి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. గత నెల ఢిల్లీలోని సూరజ్‌కుండ్ మేళాలో ఆమె పాల్గొని పోచంపల్లి ఇక్కత్ వస్త్రాల ఎగ్జిబిషన్, అదేవిధంగా ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరుగుతున్న అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో పాల్గొని చేనేత ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసింది. పోచంపల్లి పట్టణ కేంద్రంలో శ్రీరంజన్ సిల్క్ ఇండస్ట్రీ యూనిట్‌ను స్థాపించి సిల్క్ దారం నుంచి వస్త్రం తయారీ వరకు అన్నీ ఒకే దగ్గర తయారు చేయిస్తోంది. ఈ పరిశ్రమ ద్వారా 50 మందికి ఉపాధి కల్పిస్తోంది. అంతేకాక శ్రీరంజ్ వీవ్స్ పేరిట షాపు నిర్వహిస్తూ చేనేత వస్త్రాలను మార్కెటింగ్ కూడా చేస్తోంది. 2023 డిసెంబర్ 20న పోచంపల్లికి వచ్చిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శ్రీరంజన్ సిల్క్ యూనిట్‌ను సందర్శించారు. అక్కడ తయారైన చేనేత వస్త్రాలను చూసి మాధవిని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మాధవిని ప్రత్యేకంగా అభినందించారు.

వ్యవసాయంలో మేటి..



మామిడితోటలో ట్రాక్టర్‌తో చదును చేస్తున్న సంజాత

కట్టంగూర్ : కట్టంగూర్ మండలంలోని బొల్లేపల్లి గ్రామానికి చెందిన బండ సంజాత వ్యవసాయంలో రాణిస్తూ ఔరా అనిపిస్తోంది. 1986లో బండ రమేష్‌రెడ్డితో వివాహమైన నాటి నుంచి సంజాత భర్త సలహాలు సూచనలతో వ్యవసాయం చేస్తోంది. తమకున్న 23 ఎకరాల్లో 8 ఎకరాలు వరి, 15 ఎకరాల్లో మామిడి తోటను సేద్యం చేశారు. వ్యవసాయం క్షేత్రంలో ఆవులతో ఫాం ఏర్పాటు చేశారు. వ్యవసాయ పనుల్లో పురుషులకు దీటుగా అన్నీ తానై చేస్తారు. ట్రాక్టర్ నడుపుతూ పొలం దున్నడం వంటి కష్టమైన పనులను కూడా సులువుగా చేస్తోంది. తాను 10వ తరగతి వరకే చదువుకున్నా.. పిల్లలు ఉన్నత చదువులు చదివించింది. ప్రస్తుతం ఇద్దరు కుమారులు జర్మనీలో ప్రొఫెసర్లు స్థిరపడగా.. ఓ కుమారుడు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్‌గా పనిచేస్తున్నాడు. ముగ్గురు కుమారులు స్థిరపడ్డా ఆమె వ్యవసాయాన్ని వీడకుండా పలువురికి ఆదర్శంగా నిలుస్తోంది.

ఆడపిల్లకు ప్రోత్సాహకాలు

- ఆడపిల్ల పుట్టినా, వివాహమైనా రూ.2,016 నగదు అందజేస్తున్న రాంసింగ్ దంపతులు



కల్యాణ కానుక అందిస్తున్న రాంసింగ్ దంపతులు

దేవరకొండ : దేవరకొండ మండలం మైనంపల్లికి చెందిన కొర్ర రాంసింగ్ – గౌతమి దంపతులు ఆడబిడ్డలంటే ఎంతో మమకారం. దేవరకొండ నియోజకవర్గ పరిధిలో గతంలో ఆడశిశువు జన్మిస్తే భారంగా భావించిన కొన్ని గిరిజన కుటుంబాల పరిస్థితిని కళ్లారా చూశారు. ఆడపిల్లను భారంగా భావించొద్దని.. ఆడపిల్లను ఇంటికి మహాలక్ష్మిలా భావించాలని ఎందరికో అవగాహన కల్పించారు. చివరికి ఆడపిల్ల పుట్టినా, ఆడపిల్ల వివాహం చేసినా ఆర్థిక సాయం చేయాలని తలిచి గ్రామంలో రామన్న కల్యాణ కానుక పథకానికి శ్రీకారం చుట్టారు. అనుకున్నదే తడవుగా 2020లో ప్రపంచ మహిళా దినోత్సవం రోజున ఈ కార్యక్రమాన్ని అమలు చేశారు. మైనంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో మొదట్లో రూ.1,016తో ప్రారంభించిన రామన్న కల్యాణ కానుకను మరుసటి సంవత్సరం నుంచి రూ.2,016 పెంచారు. ఐదేళ్ల నుంచి గ్రామంలో ఆడబిడ్డల వివాహానికి రూ.2,016, ఆడపిల్ల జన్మిస్తే వారి కుటుంబానికి రూ.2,016 అందిస్తున్నారు. దీంతో ఆ దంపతులను పలువురు అభినందిస్తున్నారు.

అతివ.. అలుపెరుగక

పురుషులతో సమానంగా కష్టపడుతున్న మహిళలు

నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

నేటి సమాజంలోని మహిళలు అన్నిరంగాల్లో పురుషులకు దీటుగా రాణిస్తున్నారు. కుటుంబాల పోషణకు వివిధ వృత్తుల్లో కొందరు, వ్యాపార రంగంలో మరికొందరు దూసుకెళ్తున్నారు. ఇంతొందరు తమ గ్రామాల అభివృద్ధికి పాటుపడుతుండగా చాలా మంది మహిళలు సామాజిక అంశాలపై అవగాహన కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పలువురు మహిళలపై ప్రత్యేక కథనాలు.

కుటుంబ పోషణకు ఆటో డ్రైవర్‌గా మారి



హుజూర్‌నగర్‌లో ఆటో నడుపుతున్న శ్రీదేవి

హుజూర్‌నగర్: పురుషులకు దీటుగా ఆటో నడపుతూ కుటుంబాన్ని పోషిస్తుంటూ శభాష్ అనిపించుకుంటోంది యడ్ల శ్రీదేవి. హుజూర్‌నగర్ పరిధిలోని గోవిందాపురం గ్రామానికి చెందిన బొల్లెద్దు రాణెమ్మ-సాయిలుది సాధారణ కుటుంబం. సాయిలు ఆటో నడుపుతూ కుటుంబంతో జీవనం సాగిస్తున్నాడు. అతని పెద్ద కూతురు శ్రీదేవికి ఖమ్మంకు చెందిన యడ్ల వీరభద్రంతో పాతికేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కూతురు, కొడుకు ఉండగా కూతురు వివాహం చేసి అత్తవారింటికి పంపారు. ఆ తర్వాత భార్యభర్తలు విడిపోవడంతో శ్రీదేవి తన తల్లిగారి ఊరైన గోవిందాపురం వచ్చి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. చిన్నతనంలో తన తండ్రి వద్ద ఆటో తోలడం నేర్చుకున్న శ్రీదేవి కుటుంబ పోషణ కోసం తాను కూడా ఆటో నడపాలని నిర్ణయించుకుంది. అనుకున్నదే తడవుగా ఒక ఆటో కొనుక్కుని ఆటో డ్రైవర్‌గా మారింది. రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు హుజూర్‌నగర్ లోకల్‌లో ఆటో నడుపుతుంది. చుట్టుపక్కల గ్రామాలకు, పట్టణాలకు కిరాయిలకు కూడా వెళుతోంది. ఆటో డ్రైవర్‌గా రోజుకు సుమారు రూ.300 నుంచి రూ.500 వరకు సంపాదిస్తోంది. వచ్చిన కిరాయి డబ్బులతో తన కుటుంబాన్ని పోషించుకుంటూనే తన తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉంటోంది. తన ఒక్కగానొక్క కొడుకు వేణుగోపాల్‌ను ఖమ్మంలో డిగ్రీ చదివిస్తోంది. మహిళలు చిత్తశుద్ధితో ఏ పని చేసినా విజయం సాధించవచ్చని శ్రీదేవి అంటోంది.

ఆమె కోసం 'విన్నపం'

- మహిళలకు అండగా నిలుస్తున్న గోపాలపురం వాసి లీలావతి
- ఆమె పోరాటం ఫలితంగా విద్యార్థినులకు హెల్త్ కిట్లు



చీకూరి లీలావతి

హుజూర్‌నగర్ : ఆమె ఆరోతరగతి చదువుతోంది. ఆ సమయంలో వాళ్ల నాన్న సర్పంచ్‌గా పనిచేస్తున్నారు. రోజూ వచ్చిపోయేవారితో ఇల్లంతా సందడిగా ఉండేది. ఊరి ప్రజలు ఇంటికి వచ్చి నాన్నతో సమస్యలు చెప్పుకోవడం వాటిని ఆయన తీర్చడం చూస్తూ ఉండేది. అలా కొంత కాలం గడిచిన తర్వాత ఆ బాలికకు ఓ ఆలోచన తట్టింది. నాన్నలాగా ప్రజల కోసం తానూ ఏదో ఒకటి చేయాలని తలచింది. ఆ ఆలోచన నుంచి పురుడుపోసుకుందే.. 'విన్నపం ఒక పోరాటం' అనే స్వచ్ఛంద సంస్థ. విద్యార్థినులు, మహిళల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా దీనిని ఏర్పాటు చేసి ముందుకుసాగుతున్నారు చీకూరి లీలావతి.

తొమ్మిదో తరగతిలోనే..

హుజూర్‌నగర్ మండల పరిధిలోని గోపాలపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ చీకూరి తిరుపతయ్య కూతురు లీలావతి ఎంఏ, బీఈడీ పూర్తి చేసి ప్రస్తుతం ఎంపీఏ (మాస్టర్ ఆఫ్ ఫర్మామింగ్ ఆర్ట్స్) చేస్తున్నారు. తొమ్మిదో తరగతి చదువుతున్న సమయంలోనే తండ్రిని స్ఫూర్తిగా తీసుకొని 'పోరాటం ఒక విన్నపం' అనే స్వచ్ఛంద సంస్థను ఆమె ఏర్పాటు చేశారు. అప్పటి నుంచే గోపాలపురం గ్రామంలో రక్తదాన శిబిరం, వైద్య శిబిరాలు వంటి సామాజిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనే వారు. ఆ తర్వాత అమ్మాయిల్లో ఆత్మస్థైర్యం నింపడానికి స్వగ్రామంలో వేసవిలో కరాటేలో శిక్షణ ఇప్పించేవారు. ఆడపిల్లలకు ఎలాంటి ఇబ్బంది వచ్చినా ఎదుర్కొనేలా తెలియ జెప్పడం, బాల్య వివాహాలు నిర్మూలించడం, వారి సమస్యలను పరిష్కరించడం కోసం ప్రయత్నం చేశారు.

పదేళ్ల క్రితం..

విద్యార్థినులకు శానిటరీ నాప్కిన్స్ ఇవాలని సంస్థ తరఫున పదేళ్ల క్రితం సీఎంకు లేఖలు రాశారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. దీంతో అప్పటి ప్రభుత్వం హైస్కూల్ విద్యార్థినులకు హెల్త్ కిట్లు ఇవ్వడం ఆరంభించింది. అంతేకాకుండా ఆడపిల్లలకు సెల్ఫ్ డిఫెన్స్ కోసం కరాటే విద్య లాంటివి సబ్జెక్టుగా పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

విన్నపానికి అసెంబ్లీలో చర్చ

రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ఒంటరి మహిళ, వితంతు పింఛన్ పేర్లను తొలగించి వాటి స్థానంలో మహిళల్లో ఆత్మస్థైర్యం ప్రతిబింబించేలా.. మహిళా శక్తి పింఛన్లు అని పేరు మార్చాలని తమ స్వచ్ఛంద సంస్థ ద్వారా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయమై గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర అసెంబ్లీలో చర్చ కూడా జరిగింది.

ఆర్గానిక్ ప్యాడ్స్ ఇవ్వాలని పోరాటం..

ప్రస్తుతం రేషన్ దుకాణాలు, స్కూళ్లు, బస్టాండ్లలో మహిళలకు ఆర్గానిక్ ప్యాడ్స్ ఉచితంగా అందజేయాలనేది విన్నపం ఒక పోరాటం సంస్థ డిమాండ్ చేస్తోంది. ఆర్గానిక్ ప్యాడ్స్ ఉత్పత్తి చేసే పరిశ్రమలను ప్రతీ మండలానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేయాలని వాటిని మహిళలకు కేటాయించాలని ఆమె కోరుతున్నారు. ఇందుకోసం తమ భవిష్యత్ కార్యాచరణ ఉంటుందని చీకూరి లీలావతి చెబుతున్నారు.

ఖండాంతరాలు దాటిన 'కీర్తి'

- ఫుడ్ ప్రాసెసింగ్‌లో రాణిస్తున్న తొండ గ్రామవాసి ఓడపల్లి కీర్తిప్రియ
- విదేశాలకు కూరగాయల ఒరుగులు మార్కెటింగ్ చేస్తున్న యువతి



తొండ గ్రామంలోని ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీలో వివిధ ఉత్పత్తులను ప్యాకింగ్ చేస్తున్న మహిళలు

తిరుమలగిరి (తుంగతుర్తి): ఉన్నత చదువులు చదివిన ఆ యువతి పెద్ద కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు వచ్చినా వాటిని కాదని సొంత ఊరిలోనే ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీ ఏర్పాటు చేసింది. స్థానికంగా దొరికే కూరగాయలతో తయారు చేసిన (ఒరుగులు, పొడులు) ఉత్పత్తులను అంతర్జాతీయంగా మార్కెటింగ్ చేస్తూ యువ పారిశ్రామికవేత్తగా రాణిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం తొండ గ్రామానికి చెందిన ఓడపల్లి కీర్తిప్రియ. తొండ గ్రామానికి చెందిన ఓడపల్లి వెంకన్న, విజయలక్ష్మి దంపతులకు ముగ్గురు కూతుర్లు. వీరిలో రెండవ కూతురు కీర్తిప్రియ బిట్స్‌పిలానిలో బీఫార్మసి, ఐఏఎం కోల్‌కతా నుంచి ఎంబీఏ పట్టా పుచ్చుకుంది. పలు సంస్థల్లో ఉద్యోగం చేసింది. సొంతూరుకు వచ్చినప్పుడు పంటలకు గిట్టుబాటు ధర రాక కొన్ని సమయాల్లో ఉత్పత్తులను వృథాగా పడేస్తూ నష్టపోతున్న రైతుల కష్టాలు ఆమెను కదిలించాయి. దీంతో కూరగాయలు పాడైపోకుండా వాటితో ఒరుగులు, పొడులు తయారీ చేసి విక్రయించే వ్యాపారానికి గ్రామం నుంచే శ్రీకారం చుట్టింది. రూ.3 కోట్లతో ఎకరం స్థలంలో గ్రామంలోనే నేచురల్ ఫీల్డ్స్ ఇండస్ట్రీస్ పేరుతో ఫ్యాక్టరీ ఏర్పాటు చేసింది. ఫ్యాక్టరీలో సోలార్ డ్రయ్యర్‌ను ఏర్పాటు చేసి కొందరు మహిళలతో కూరగాయలను ముక్కలుగా కోయించి వాటిని ఎండబెట్టి పొడులుగా మార్చి ప్యాకింగ్ చేసి ఖో(కేఓహెచ్) పేరుతో మార్కెటింగ్ చేస్తోంది.

అమెరికా, యూరప్ దేశాలకు ఎగుమతి..

రసాయనాల ప్రభావం లేకుండా సేంద్రియ విధానంతో స్థానిక రైతులతో కూరగాయలు, పండ్లను పండించి వాటిని ఇక్కడే ప్రాసెస్ చేసి వ్యాపారం చేస్తోంది. రైతులు పండించిన కూరగాయలు, ఆకుకూరలు, క్యారట్, బీట్‌రూట్, ఉల్లిగడ్డ, బెండకాయ, పచ్చి మిర్చి, టమాట, పాలకూర, గోంగూర, మునగ, అరటి పువ్వు, సపోట, మామిడి తదితర పండ్లను ఎండబెట్టి నాణ్యతలో రాజీపడకుండా ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను తయారు చేయిస్తోంది. ఈ ఉత్పత్తుల్లో పోషకాలు పుష్కలంగా ఉండడంతో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ఆర్డర్లు పెరిగాయి. మనదేశంలోని అన్ని రాష్ట్రాలతోపాటు అమెరికా, యూరప్ దేశాలకు ఫుడ్ ఉత్పత్తులను ఎగుమతి చేస్తూ ఏడాదికి రూ.80 లక్షల నుంచి రూ.కోటి వరకు టర్నోవర్ సాధిస్తోంది.

మహిళలకు ఉపాధి..

సొంత గ్రామంలో ఏర్పాటు చేసిన ఫ్యాక్టరీలో 20 మంది మహిళలకు రోజూ ఉపాధి కల్పిస్తోంది కీర్తిప్రియ. వీరు మూడు షిఫ్టుల్లో పనిచేస్తూ కూరగాయల పొడులు, ఒరుగులను ప్యాకింగ్ చేసి ఎగుమతికి సిద్ధం చేస్తుంటారు. ఏడాది పొడవునా స్థానికంగా ఉపాధి లభిస్తుండడంతో ఎంతో ఆనందంగా పని చేసుకుంటున్నామని మహిళలు అంటున్నారు.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే కంపెనీ ఏర్పాటు



ఉన్నత చదువులు చదివినప్పటికీ ఎక్కడో ఉద్యోగం చేయకుండా మా సొంత గ్రామంలోనే ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీ ఏర్పాటు చేసి కొందరి మహిళలకు ఉపాధి కల్పిస్తూ వ్యాపారరంగంలో రాణిస్తువడం చాలా ఆనందంగా ఉంది. మా తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ఈ కంపెనీని నడిపిస్తున్నాను. – ఓడపల్లి కీర్తిప్రియ

పర్యావరణ హితం.. రమణి అభిమతం

- బయోడీగ్రేడబుల్ బ్యాగులు తయారు చేస్తున్న మహిళా పారిశ్రామికవేత్త
- గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్‌లో పరిశ్రమతో పలువురికి ఉపాధి



పరిశ్రమలో తయారవుతున్న బయోడీగ్రేడబుల్ కవర్లను పరిశీలిస్తున్న రమణి

చౌటుప్పల్ రూరల్: పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా భూమిలో త్వరగా కలిసిపోయే బ్యాగులు తయారు చేయాలనే సంకల్పం ఆమెను పారిశ్రామికవేత్తను చేసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా సంతమంగుళూరు మండలం మామిళ్లపల్లికి చెందిన శ్రీరామనేని రమణి ఎమ్మెస్సీ వరకు చదివింది. రమణి భర్త డాక్టర్ ప్రసాద్ సౌదీ అరేబియాలోని రియాద్‌లో ప్రభుత్వ వైద్యుడిగా విధులు నిర్వహించడంతో ఆమె కూడా 13 ఏళ్ల పాటు అక్కడే ఉండి భారత్‌కు తిరిగివచ్చారు. ఇక్కడకు వచ్చిన తర్వాత రమణి భర్తకు కిడ్నీ మార్పిడి చేయాల్సి వచ్చింది. దీంతో ఆమె తన కిడ్నీ దానం చేసింది. ఆ సమయంలో ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా బయోడీగ్రేడబుల్ సంచులు తయారు చేయాలనే ఆలోచన రావడంతో ఆమె డీఆర్‌డీఓ శాస్త్రవేత్తల్ని కలిసింది. డీఆర్‌డీఓ శాస్త్రవేత్తలు సూచించిన పరిజ్ఞానంతో బయోడీగ్రేడబుల్ సంచులు తయారు చేయడం ప్రారంభించారు. రెండేళ్ల పాటు కుటీర పరిశ్రమగా నిర్వహించిన తర్వాత యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురంలోని గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్‌లో రమణి ఇండస్ట్రీస్ పేరుతో బయోకంపోస్టికా పరిశ్రమను స్థాపించారు. గతేడాది నవంబర్ నుంచి ఇక్కడ నుంచి బయోడీగ్రేడబుల్ సంచులు, గిఫ్ట్ బ్యాగుల తయారీని ప్రారంభించారు. క్యారీ బ్యాగులు, ఎన్వలప్‌లు, ఫుడ్ ప్రాసెసింగ్ షీట్లు, మల్చింగ్ కవర్లు ఈ పరిశ్రమలో తయారు చేస్తున్నారు. వాటిని సౌదీ అరేబియాకు ఎగుమతి చేస్తున్నారు. ఈ పరిశ్రమలో రెండు షిఫ్టుల వారీగా 35మందికి ఉపాధి కల్పిస్తున్నారు.

జాతీయ స్థాయిలో ఊరి పేరు నిలబెట్టింది

- పోతిరెడ్డిపల్లి రూపురేఖలు మార్చిన మాజీ మహిళా సర్పంచ్



గనగాని మాధవి

ఆత్మకూరు(ఎం): ఉన్నత చదువులు చదివిన ఆ మహిళ మారుమూల గ్రామానికి సర్పంచ్‌గా ఎన్నికై ఆ గ్రామ పేరును దేశస్థాయిలో నిలబెట్టింది. యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి 2018 నుంచి 2024 ఫిబ్రవరి వరకు గనగాని మాధవి సర్పంచ్‌గా కొనసాగారు. డిగ్రీ, డీఎడ్ పూర్తిచేసిన మాధవి ఉన్నత చదువులు చదివే అవకాశం ఉన్నప్పటికీ సర్పంచ్‌గా అవకాశం రావడంతో గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టింది. ఇంటింటికి చెత్త సేకరణతో పాటు గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు, ప్రతి వీధిలో మొక్కలు నాటే కార్యక్రమం, నిరుపేదలకు ఆర్థికసాయం అందజేయడం వంటి పనులు చేపట్టింది. గనగాని మాధవి చేసిన కృషి ఫలించి 2021లో రాష్ట్ర ప్రభుత్వం పోతిరెడ్డిపల్లిని ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపిక చేసింది. అప్పట్లో యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనితారామచంద్రన్ చేతుల మీదుగా మాధవి అవార్డు అందుకున్నారు. అంతేకాకుండా రాష్ట్ర స్థాయిలో సావిత్రిబాయి పూలే అవార్డును సైతం 2022లో ఆమె అందుకున్నారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా పోతిరెడ్డిపల్లిని ఆదర్శంగా తీర్చిదిద్దడంతో గనగాని మాధవి దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి ఎంపికైన ఉత్తమ సర్పంచ్‌లతో కలిసి హర్యానా, ఢిల్లీ ప్రాంతాల్లో పర్యటించారు. గ్రామాభివృద్ధిలో తన భర్త, గ్రామస్తుల సహకారం మరువలేనిదని పేర్కొన్నారు.